క్లుప్తంగా

ఘనంగా బీటీఏ వార్షికోత్సవం

కావలి (జలదంకి): కావలిలోని పెన్షనర్స్ భవనంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ 25వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ బీటీఏ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మహాశక్తిగా ఎదుగుతోందన్నారు. జిల్లాలోని 36 మండలాల్లో బీటీఏ సభ్యత్వ నమోదు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు, రాష్ట్ర నాయకులను సన్మానించారు. బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు, ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, కోశాధికారి ఆదినారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ముసలయ్య, ఉపాధ్యక్షులు, డివిజన్, మండల నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి రూరల్: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి ఎస్వీఎస్ రాఘవేంద్ర శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని సూచించారు. పశువులశాలలు చిత్తడిగా లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు, ఈగల బెడద లేకుండా బ్లీచింగ్ లేదా సున్నం చల్లి వేపాకు పొగ వేయాలన్నారు. జిల్లేడు ఆకుల పొగ వేయడం ద్వారా శ్వాస సంబంధిత వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. గిట్టలు పాయకుండా ఐదు శాతం ఫార్మాలిన్ లేదా మైలుతుత్తం ద్రావణంలో కడిగాలని సూచించారు. పశువులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే తనను లేదా వెటర్నరీ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు. పశువులు అకస్మాత్తుగా మృత్యువాత పడితే తమకు వెంటనే సమాచారం అందజేస్తే ఏదైనా అంటువ్యాధి ఉన్నట్లయితే ప్రబలకుండా జాగ్రత్త పడొచ్చన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకరకు మాతృవియోగం

కావలి (జలదంకి): కావలికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సుంకర దయాకర్ రెడ్డి మాతృమూర్తి అంజమ్మ ఆదివారం మరణించారు. ఆమె మృతిపై కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. సుంకర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుంకర కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడ్ని ప్రార్థించారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 2వ వార్డుకు చెందిన షేక్ షరీఉన్నీసా, 4వ వార్డుకు చెందిన చల్లా సునీత, 13వ వార్డుకు చెందిన పెంచలయ్య, 23వ వార్డుకు చెందిన డీ సుధాకరాచారి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను పరమేశ్వరరెడ్డి పరామర్శించి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి

కలిగిరి: స్థానిక కూరగాయల మార్కెట్ నుంచి పాపనముసిలిపాళెం రోడ్డు వరకు చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరి మాల్యాద్రిరెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. జెడ్పీ నిధులతో డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లుగా ఆయన తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్ రాగి దివ్య, ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొర్రా మస్తాన్‌రెడ్డి, సానా శ్రీనివాసులు రెడ్డి, మూలి రాధాకృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

సోమశిల: చేజర్ల మండలం ఆదురుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ పద్మజ ఆదివారం తెలిపారు. 5వ తరగతిలో పది సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన ఎస్సీ విద్యార్థులు గురుకులంలో సంప్రదించాలని కోరారు.

నిరాశాజనకంగా పొగాకు ధరలు

- డీసీపల్లి వేలం కేంద్రంలో ముగిసిన 15 రౌండ్ల వేలం
- రూ.157.67 కోట్ల మేర అమ్మకాలు
- రూ.280కు మించని కిలో ధర
- గతేడాది పోల్చితే భారీగా పతనమైన ధరలు



పొగాకు వేలం ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

మర్రిపాడు: పొగాకు రైతుల ఆశలు ఆవిరయ్యాయి. గత రెండేళ్లుగా పొగాకు ధరలు ఆశాజనకం ఉన్నాయి. గతేడాది పొగాకు రైతులకు మంచి లాభాలొచ్చాయి. దీంతో ఏడాది రైతులు పొలాలు, బ్యారెన్లను లీజుకు తీసుకుని మరీ భారీస్థాయిలో సాగుచేపట్టారు. పొగాకు సాగుకు ఒక్కసారిగా డిమాండ్ రావడంతో పొలాలు, బ్యారెన్ల లీజు ధరలు పెరిగాయి. పెట్టుబడులు సైతం భారీగా పెరిగాయి. అయితే వేలంలో పొగాకు ధరలు ఆశించిన మేరకు పలకకపోవడంతో తమ కష్టానికి ఫలితం దక్కలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో మార్చి 9న ప్రారంభమైన వేలం 111 రోజులపాటు సాగింది. శనివారం నాటికి 15 రౌండ్ల వేలం ప్రక్రియ ముగిసింది. ఇప్పటి వరకు వేలంలో రూ.157.67 కోట్ల మేర పొగాకు కొనుగోళ్లు జరిగాయి. గతేడాది 75 రోజుల పాటు జరిగిన వేలంలోనే రూ.153 కోట్ల మేర పొగాకు కొనుగోళ్లు జరిగాయి. గతేడాది ధరలు ఆశాజనకంగా ఉండడంతో అన్ని గ్రేడ్లకు మంచి ధరలు వచ్చి రైతులు లాభాలను అందుకున్నారు. గతేడాది మాదిరే ఈ ఏడాది కూడా పొగాకు మంచి ధరలు లభిస్తాయని రైతులు భావించారు. అయితే మార్కెట్లో నెలకొన్న ఒడిదొడుకులతోనే రైతులు ఆశించిన మేరకు ధరలు లభించలేదు. ప్రస్తుతం 15 రౌండ్ల వేలం ప్రక్రియ ముగిసే నాటికి రైతుల కష్టానికి తగిన ఫలితం లభించలేదు.



పొగాకు పంట

రూ.280 దాటని గరిష్ట ధర

డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో ఇప్పటి వరకు 15 రౌండ్ల వేలం ముగిసింది. తొలి రోజు కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 పలికింది. ఇప్పటి వరకు ధర అంతకు మించలేదు. మార్కెట్ ఒడిదొడుకులకు అనుగుణంగా కనిష్ట ధరలు మాత్రం పెరుగుతూ తగ్గుతూ వస్తున్నాయి. ఇప్పటి వరకు అత్యల్ప కనిష్ట ధర రూ.159, అత్యధిక సగటు ధర రూ.236.95గా నమోదయ్యాయి. ఇప్పటి వరకు వేలానికి 74,435 బేళ్లు రాగా, నోసేల్ కింద 3,733, నోబిడ్ కింద 12,950, ఆర్ఆర్‌గా 1,352, సీఆర్‌గా 2,619, బీఆర్‌గా 1,053 కలిపి మొత్తం 21,707 బేళ్లను అధికారులు తిరస్కరించారు. మిగిలిన 57,728 బేళ్లను వివిధ కంపెనీల ప్రతినిధులు కొనుగోలు చేశారు. మొత్తం రూ.157,67,73,580 వ్యాపారం జరిగింది. వేలం ప్రక్రియలో 2081 మంది రైతులు 1747 బ్యారెన్ల ద్వారా అమ్మకాలు చేసినట్లుగా అధికారులు తెలిపారు.

కొనుగోలు చేసే బేళ్లనే తీసుకురావాలి



ఈ ఏడాది పొగాకు మార్కెట్ కొంత ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. ప్రస్తుతం వేలంలో ఒకటో నంబరు, మంచి మచ్చలు, రెండో నంబరు ముదురులోని అడుగు పలచని ఆకులను మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. వాటిని మాత్రమే రైతులు తీసుకొచ్చి విక్రయించుకోవాలి. రెండో నంబరు పొగాకును కొనుగోలు చేయడం లేదు. ఆ రకం అమ్ముడుపోయే సమయంలో రైతులకు తెలియజేస్తాం. రైతులు ముందురోజు వచ్చి వేలాన్ని పరిశీలించి అమ్మకం జరిగే బేళ్లను తెచ్చుకోవాలి.

– జీ రాజశేఖర్, వేలం నిర్వహణాధికారి, డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం

ఉపాధ్యాయినికి సన్మానం



పర్వీన్ దంపతులను సత్కరిస్తున్న సహోపాధ్యాయులు

వింజమూరు(ఉదయగిరి): కలిగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న షేక్ పర్వీన్ గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. ఆమె ఉద్యోగ విరమణ సభను వింజమూరులోని వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో ఆదివారం నిర్వహించారు. సహచర ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హాజరై పర్వీన్ దంపతులను ఘనంగా సన్మానించారు. 36 ఏళ్ల పాటు సైన్స్ ఉపాధ్యాయినిగా పర్వీన్ అందించిన సేవలను కొనియాడారు. ఆమె శేషజీవితం సుఖంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వింజమూరు జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ ఎస్ స్నుజన, వివిధ పార్టీల నేతలు, ఉపాధ్యాయులు, సహోద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట



అనుమసముద్రంపేట: మండలంలోని చిరమనలో గ్రామదేవత పోలేరమ్మ విగ్రహ పునఃప్రతిష్టను ఆదివారం వైభవంగా నిర్వహించారు. కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, కాటంరెడ్డి నారసింహారెడ్డి, కర్నాటి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట చేపట్టారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దేవాలయాలకు నిధుల విడుదల

ఆత్మకూరురూరల్: మండలంలోని 16 ఆలయాలకు రాష్ట్ర ప్రభుత్వం దేవదాయశాఖ ద్వారా నిధులను మంజూరు చేసిందని టీడీపీ నాయకులు కేతా విజయభాస్కర్‌రెడ్డి, సుంకర పెంచలచౌదరి తెలిపారు. ఆదివారం ఆలయాల నిర్వాహకులకు నిధుల మంజూరుకు సంబంధించిన పత్రాలను వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఒక్కో ఆలయానికి మరమ్మతులకు రూ.5 లక్షలు, ధూపదీప నైవేద్యాల కోసం నెలకు రూ.10 వేలు చొప్పున మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు.

రేషన్ పంపిణీ అస్తవ్యస్తం



రేషన్‌షాపు వద్ద పడిగాపులు పడుతున్న లబ్ధిదారులు

దగదర్తి: మండలంలోని కొత్తపల్లికొరుగుంట పంచాయతీలో రేషన్ పంపిణీ అస్తవ్యస్తంగా తయారైంది. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీని నిలిపివేసినప్పటి నుంచి రేషన్ డీలర్ సక్రమంగా సరుకులు పంపిణీ చేయడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ పరిధిలో మిట్టపాళెంలో రేషన్ షాపు ఉంది. సుమారు 440 రేషన్ కార్డులు ఉన్నాయి. పంచాయతీ పరిధిలోని సున్నపుట్టి బీసీ, ఎస్సీ కాలనీలకు చెందిన వారు సుమారు రెండు కిలోమీటర్ల మేర నడిచి వచ్చి రేషన్ సరుకులు తీసుకెళ్లాల్సి ఉంది. అయితే కాలినడకన వచ్చి సరుకులు ఇవ్వమని అడిగితే డీలర్ ఇష్టానుసారంగా మాట్లాడుతూ ఇప్పుడు ఇవ్వడం కుదరదని, తర్వాత రమ్మని చెబుతున్నారని ఆయా కాలనీలకు చెందిన లబ్ధిదారులు వాపోతున్నారు. మరుసటి రోజు వచ్చినా సరుకులు పంపిణీ చేయడం లేదని, సరుకులు లేవని డబ్బులు ఇస్తామని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై డీలర్‌పై లబ్ధిదారులు సర్పంచ్‌తో కలిసి ఆదివారం ఫోన్ ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు పంపిణీ చేసేవారని, ప్రస్తుతం డీలర్ తీరుతో రేషన్ దుకాణం చుట్టూ పనులు మానుకుని తిరగాల్సి వస్తోందని వాపోయారు. అధికారులు స్పందించి సున్నపుబట్టిలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేసి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.

న్యాయవాదుల సహకారం మరువలేనిది

నెల్లూరు(లీగల్): గత జూన్‌లో జరిగిన నెల్లూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో వేనాటి న్యాయవాదుల ప్యానెల్ గెలుపునకు న్యాయవాదుల సహకారం మరువలేనిదని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో నగరంలోని అనిల్‌గార్డెన్స్‌లో ఆదివారం రాత్రి గెట్ టుగెదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం ముందుంటానన్నారు. జిల్లా జడ్జి శ్రీనివాస్ మాట్లాడుతూ హైకోర్టు అనుమతితో జిల్లా కోర్టు సుందరీకరణ పనులకు రూ.1.90 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. అనంతరం వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్ప రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నక్కల నాగరాజు, సహాయ కార్యదర్శి కేఎల్ నారాయణ, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శి చంద్రశేఖర్‌నాయుడు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బోరుకు హెడ్ బిగించరూ..



వరికుంటపాడు: మండలంలోని వేంపాడు పంచాయతీ వెంగమాంబపురంలో చేతిబోరుకు హెడ్ లేకపోవడంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం చేతిబోరు హెడ్ మరమ్మతులకు గురవడంతో తొలగించారు. అప్పట్నుంచి దాన్ని బిగించకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరుకు హెడ్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపుపై రైతు ఫిర్యాదు



దగదర్తి: తన పొలంలోని గ్రావెల్‌ను కొందరు అక్రమంగా తరలిస్తున్నారని రైతు తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసిన ఘటన మండలంలోని తిరువీధిపాడులో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు..తిరువీధిపాడుకు చెందిన రైతు మోపూరు భక్తవత్సలరెడ్డికి సర్వే నంబర్ 118లో కొంత భూమి ఉంది. ఆదివారం సాయంత్రం రైతుకు చెందిన కాపలాదారులు పొలం వద్దకు వెళ్లి చూడగా ప్రొక్లయినర్‌తో టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. వారు వెంటనే భక్తవత్సలరెడ్డికి సమాచారం అందించి తరలింపును అడ్డుకున్నారు. అనంతరం తహసీల్దార్ పీ కృష్ణకు రైతు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. తన భూమిలో గుంటలు తీసి గ్రావెల్‌ను తరలించి తనకు నష్టం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలకు తీరని నష్టం



సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మర్రిపాడు: స్మార్ట్ మీటర్లతో ప్రజలకు తీరని నష్టం కలుగుతుందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య అన్నారు. ఆదాని స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మర్రిపాడులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లను బిగించారని తెలిపారు. ఇప్పుడు అనుమతి లేకుండా మోసపు మాటలు చెప్పి గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు వస్తున్నారన్నారు. దీని వల్ల శాశ్వతంగా ప్రజలపై విద్యుత్ భారం పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్లకు సెల్‌ఫోన్ పద్ధతిలో ముందుగా నగదు చెల్లించి రీచార్జ్ చేసుకోవాలని, ఇంటింటికి వచ్చి బిల్లులు తీయరని, ఆన్‌లైన్‌లో బిల్లు వస్తుందన్నారు. బిల్లు ఎక్కువ వచ్చినా సమాధానం చెప్పేవారే ఉండరన్నారు. పగలు ఒక రేటు, రాత్రులు ఒక రేటు ఉంటుందన్నారు. ఎప్పుడు పడితే అప్పుడు రేట్లు పెంచవచ్చునన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ.15,485 కోట్ల భారం వేసిందని విమర్శించారు. సీపీఎం మండల కార్యదర్శి సయ్యద్ రహమతుల్లా, సీఐటీయూ మండల కార్యదర్శి బత్తల రత్నయ్య, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు గౌరవరం శ్యామలమ్మ, భవన నిర్మాణ కార్మికుల మండల కార్యదర్శి దండు జాన్సన్, నాయకులు పోలిరెడ్డి, సూర్యనారాయణ, తిరుపతమ్మ, హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటోవాలాలకు సూచనలు చేస్తున్న సీఐ వెంకట్రావు

ఉదయగిరి: ఉదయగిరి పోలీస్ సర్కిల్ పరిధిలోని ఆటోవాలాలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ వెంకట్రావు అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో ఆటోవాలాలతో సమావేశం నిర్వహించారు. ఆటోవాలాలు వాహన, డ్రైవింగ్ లైసెన్సులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆటల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. ఆటోల్లో ఎక్కే ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. అనంతరం పంచాయతీ బస్టాండ్ వ్యాపారులతో చర్చించారు. మార్జిన్లను ఆక్రమించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బస్టాండ్ విశాలంగా లేనందున ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పది విద్యార్థికి అభినందనలు



ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివి 560 మార్కులు సాధించిన ఎస్సీ బాలుర వసతిగృహ విద్యార్థి సాయిధనూష్‌ను పలువురు ఆదివారం అభినందించారు. షిర్డీ సాయిరామ్ కళాశాలలో జరిగిన జేవీవీ వైద్య శిబిరానికి హాజరైన ప్రముఖ వైద్యుడు ఎంవీ రమణయ్య, మెడికవర్ ఆస్పత్రి గుండెవ్యాధి నిపుణులు బాలకృష్ణ, జస్వంత్ శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో షేక్ సందానీ, ఎల్ కృష్ణప్రసాద్, జేవీవీ నాయకులు హరికృష్ణ, మల్లికార్జున పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



ధ్యానంపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ఉమామహేష్

ఆత్మకూరు: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సీనియర్ ధ్యాన మాస్టర్ ప్రకృతి ఉమామహేష్ తెలిపారు. పట్టణంలోని షిర్డీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో కాశీనాయన ఆశ్రమ ప్రాంగణంలో ప్రత్యేక ధ్యాన శిక్షణా తరగతులను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన మాస్టర్ ఉమామహేష్ మాట్లాడుతూ ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. శాఖాహారాన్ని తీసుకుంటూ క్రమం తప్పకుండా ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు.

ప్రాచీన కళలను కాపాడుకోవాలి

మనుబోలు: ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్సై శివరాకేష్ అన్నారు. మనుబోలు కోదండరామపురంలో ఆదివారం సిద్దేంద్ర యోగి కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య శిక్షణా కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతుల ప్రభావంతో భారతీయ ప్రాచీన కళలు, సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. కూచిపూడి గురువు డేగల సాంబశివరావు, ఆయన శిష్యురాలు పృథ్వీ పూర్ణిమ కృషి అభినందనీయమన్నారు. అనంతరం పూర్ణిమ కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించారు.

ఆగని దందా..ఆపే దమ్ముందా..!

- చెలరేగిపోతున్న గ్రావెల్ మాఫియా
- టీడీపీ నేతల ప్రమేయంతో రేయింబవళ్లు తవ్వకాలు
- చెరువుల నుంచి అక్రమంగా తరలింపు
- శ్మశానాలను వదలని అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



వింజమూరు చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. అధికార పార్టీ అండతో యథేచ్ఛగా గ్రావెల్ దందాను సాగిస్తోంది. చెరువులు, ప్రభుత్వ భూములు, శ్మశానాల నుంచి రేయింబవళ్లు మట్టిని లేఅవుట్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటోంది. అధికారం మాది..మమ్మల్ని అడ్డుకునేదెవరంటూ అధికారులకు సవాలు విసురుతోంది. చెరువుల్లో భారీ ఎత్తున తవ్వకాలు జరుపుతూ చెరువులను నాశనం చేస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు.రెవెన్యూ అధికారులు సైతం మాకెందుకులే అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. దీంతో అక్రమార్కులు ప్రభుత్వ ఖజానాకు తూట్లు పొడుస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. వింజమూరు మండలంలోని చెరువుల నుంచి రాత్రి పగలు అనే తేడా లేకుండా మట్టి తరలిస్తున్నారు.వింజమూరులోని పాతూరు, యర్రబల్లిపాళెం చెరువుల్లోనూ మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రైతుల పేరుతో అనుమతులు తీసుకుని లేఅవుట్లకు మట్టిని తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. వ్యవసాయ భూములకు చెరువు మట్టిని తరలించేందుకు క్యూబిక్ మీటరుకు రూపాయి మాత్రమే ప్రభుత్వానికి చెల్లిస్తే సరిపోతుంది. దీంతో కొత్తగా వెంచర్లు వేసే ఆలోచన ఉన్న వారు వ్యవసాయ భూముల పేరుతో అనుమతులు తీసుకుని నామమాత్రంగా రుసుం చెల్లించి మట్టిని తరలిస్తున్నారు. ఆ తర్వాత ఆ మట్టితో దర్జాగా వెంచర్లు వేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు, వెంచర్లు వేసేవారు ముందస్తు అవగాహనతో ఈ తంతు కొనసాగిస్తున్నారు. వింజమూరు మండలం నందిగుంట శ్మశాన వాటిక నుంచి రెండ్రోజుల కితం రాత్రి వేళల్లో లేఅవుట్ల కోసం మట్టిని తరలించారు. వరికుంటపాడు మండలం జీ కొండారెడ్డిపల్లి చెరువు నుంచి లేఅవుట్ల కోసం అక్రమంగా మట్టిని తరలించారు. మీడియాలో కథనాలు రావడంతో ఇరిగేషన్ అధికారులు నామమాత్రంగా జరిమానా విధించి చేతులు దులుపుకున్నారు.అదే మండలంలో టీ కొండారెడ్డిపల్లి చెరువు నుంచి వ్యవసాయ పొలాల చదును కోసం మట్టి తరలింపు వివాదంగా మారింది. జలదంకి మండలం జమ్మలపాళెంలో గ్రావెల్ అక్రమ తరలింపు వివాదంలో అధికార పార్టీ నేతలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దుత్తలూరు మండలంలో గ్రావెల్ అక్రమ తరలింపు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

గ్రావెల్ మాఫియాపై చట్టపరంగా చర్యలు

మండలంలోని ప్రభుత్వభూములు, చెరువుల నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వ్యవసాయ భూములకు చెరువు మట్టిని తోలుకునే రైతులకు నిబంధనల మేరకు అనుమతులు ఇస్తాం. ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారుల సమన్వయంతో గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్ట వేస్తాం.

–హమీద్, తహసీల్దార్, వింజమూరు